# వైద్య కళాశాలలకు మహర్దశ

- ప్రభుత్వ కాలేజీల్లో కొత్తగా 5వేల పీజీ సీట్ల మంజూరు
- నూతన కోర్సుల ప్రారంభానికి ప్రోత్సాహం
- నేరుగా కళాశాల అధిపతికే నిధులు.. కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న వైద్య కళాశాలలకు మహర్దశ పట్టనుంది. దేశంలోని 148 ప్రభుత్వ వైద్య కళాశాలల స్థాయిని పెంచి, బలోపేతం చేయాలని కేంద్రం నిర్ణయించింది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా కొత్త పీజీ కోర్సులను ప్రారంభించడానికి అనుమతించడంతో పాటు, ప్రస్తుతం ఉన్న పీజీ సీట్లకు అదనంగా 5000 సీట్ల మంజూరుకు ఆమోదముద్ర వేసింది. పీజీ కోర్సులకు ఉన్న డిమాండ్‌ను అర్థం చేసుకున్న కేంద్రం ఈ సానుకూల నిర్ణయం తీసుకుంది. గురువారం ప్రధాని మన్మోహన్‌సింగ్ అధ్యక్షతన జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఇందుకు సంబంధించిన కీలక ప్రతిపాదనకు అంగీకారం తెలిపింది. దీనివల్ల అనాటమీ, మైక్రోబయాలజీ, ఫిజియాలజీ, ఫార్మకాలజీ, బయోకెమిస్ట్రీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్ వంటి కోర్సుల్లో సీట్లు గణనీయంగా పెరగనున్నాయి. ఓబెస్టెట్రిక్స్, గైనకాలజీ, పీడియాట్రిక్స్, అనస్థియాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ వంటి విభాగాల్లోనూ సీట్లు పెరుగుతాయి. ఇందుకు సంబంధించి కేంద్రం ప్రారంభించనున్న నూతన పథకంలో భాగంగా వన్‌టైమ్ గ్రాంటు కింద రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలలకు రూ.1,350 కోట్లు అందజేస్తుంది. కొత్త పీజీ కోర్సులు ప్రారంభానికి, ఉన్న పీజీ సీట్లను పెంచడానికి అయ్యే ఖర్చులో కేంద్రం 75 శాతం భరిస్తుంది. మిగతా ఖర్చును రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సి. నిధులను నేరుగా వైద్య కళాశాల అధిపతికి రెండు వాయిదాల్లో పంపుతారు.

**19-02-2010 Andhra Jyothi**